బంగారు పతక 'ధీర'జ్

రిపబ్లిక్ డే జూనియర్ నేవీ కేటగిరిలో సత్తా



వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి విద్యార్థి ధీరజ్‌ను అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

నిజాంపేట్: న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో బాచుపల్లి వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి పాఠశాల 9వ తరగతి విద్యార్థి నాగండ్ల ధీరజ్ సత్తాచాటాడు. జూనియర్ నేవీ కేటగిరీలో బంగారు పతకాన్ని సాధించడంతో అభినందనలు వెల్లువెత్తాయి. ఈనెల 27న కరియప్ప గ్రౌండ్‌లో జరిగిన 'అమృత్ కాల్‌కి ఎన్‌సీసీ'ర్యాలీ అనంతరం ధీరజ్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బంగారు పతకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ మనోజ్ పాండే, ఎయిర్ ఫోర్స్ మార్షల్ వివేక్‌రామ్‌చౌదరి, నేవీ చీఫ్‌మార్షల్ హరికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శ్రీమతి కొడాలి విజయ రాణి మాట్లాడుతూ... ధీరజ్ సాధించిన అత్యుత్తమ విజయం ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.

హెల్మెట్ ధరించు.. సురక్షితంగా ఇంటికి వెళ్లు..



మాట్లాడుతున్న జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి



యముడి వేషధారణలో వాహనదారులకు అవగాహన కల్పిస్తూ..

దుండిగల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గండిమైసమ్మ చౌరస్తాలో అపర్ణ సినర్జీ ప్రాజెక్ట్ సహకారంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ... వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.ర్యాష్ డ్రైవింగ్, త్రిపుల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యముడి వేషధారణలో ఉన్న వ్యక్తి వాహనదారులకు అవగాహన కల్పించారు. ''హెల్మెట్ ధరించు.. సురక్షితంగా ఇంటికి వెళ్లు''అని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ జీఎం సురేశ్‌బాబు, డీజీఎం శివప్రసాద్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ తుషార్ బిసెన్, డిప్యూటీ మేనేజర్ సురేంద్ర పాల్గొన్నారు.

సైబేజ్ దాతృత్వం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట వెంకటేశ్వరనగర్‌లోని నయశ్రీ ఫౌండేషన్ అనాథాశ్రమానికి గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ నిత్యావసరాలను అందజేసింది. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటీవ్ అనపురపు సురేశ్ మాట్లాడుతూ.. తమ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు చేయూతను అందిస్తోందన్నారు. భవిష్యత్‌లో తమ సేవలను విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు సింధు, గౌతమి, గోపీకృష్ణ, వెంకటేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



అనాథాశ్రమానికి నిత్యావసరాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

3 మీకు.. 4 మాకు!

కొందరు స్థల పరిరక్షణకు మద్దతు.. మరికొందరు అక్రమార్కులకు వత్తాసు

- సెటిల్‌మెంట్ చేసుకుందామంటూ ముమ్మర ప్రయత్నాలు
- స్థలం ప్రభుత్వానిదా? లేక ధోబీఘాట్ వాసులదా? ఎటూ తేల్చని అధికారులు



భగత్‌సింగ్‌నగర్‌లో వివాదంలో ఉన్న ప్రభుత్వ స్థలం

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థల వివాదం అధికారుల నిర్లక్ష్యం.. ప్రజాప్రతినిధుల అండదండలతో కొన్నేళ్లుగా తెగని సమస్యగా మారింది. కొంత మంది స్థల పరిరక్షణగా మద్దతుగా పోరాడుతుంటే.. మరికొందరు స్థానిక నేతల అండదండలతో అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారు. సెటిల్‌మెంట్ చేసుకుందామంటూ తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరం చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

◆ ఇక్కడ ప్రభుత్వానికి, పక్కన ఉన్న ధోబీఘాట్ వాసులకు మధ్య స్థల వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా కొంత మంది ఓ గ్రూపుగా ఏర్పడి ధోబీఘాట్ వాసులకు మూడు, తమకు నాలుగు ప్లాట్ల చొప్పున తెరవెనుక ఒప్పందం పేరుతో ఈ స్థలంలో పాఠశాల భవనం నిర్మించాలన్న ప్రతిపాదన తెచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

◆ అందులో భాగంగానే తాజాగా ఓ పరిశ్రమ యాజమాన్యం రూ. 4.5 కోట్లతో పాఠశాల భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందంటూ భగత్‌నగర్‌లో ఓ కరపత్రం చక్కర్లు కొడుతోంది. ఈ కరపత్రం ఆధారంగా 'సాక్షి'ఆరా తీయగా గతంలో విద్యాశాఖ స్థలం చూపిస్తే పాఠశాల నిర్మిస్తామని గతంలో చెప్పినట్లు గ్లాండ్ ఫార్మా ప్రతినిధులు పేర్కొంటున్నారు.

◆ ఇదే విషయమై ఎంఈఓ ఆంజనేయులును 'సాక్షి'సంప్రదించగా గతంలో జిల్లా కలెక్టర్‌కు ఈ విషయమై దరఖాస్తు చేయగా ధోబీఘాట్ స్థలం వివాదంలో ఉన్నట్లు ప్రత్యుత్తరం అందినట్లు తెలిపారు. ఈ స్థలంలో ముందుగా ప్రహరీ నిర్మించిన తర్వాతనే ఏదైనా నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటుండటం విశేషం.

అధికారులదీ అదే దారి..

భగత్‌సింగ్‌నగర్ ధోబీఘాట్ స్థలాన్ని మండల రెవెన్యూ నుంచి జీహెచ్‌ఎంసీకి బదిలీ చేసినా కబ్జా పర్వం ఆగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కొందరికి వరంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ స్థలం తమదేనంటూ ధోబీఘాట్ వాసులు పేర్కొంటుండగా.. ప్రభుత్వానిదా లేక ధోబీఘాట్ వాసులదా? అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రజాప్రతినిధుల అండతోనే..

భగత్‌సింగ్‌నగర్‌లోని 29 గుంటల ప్రభుత్వ స్థల పరిరక్షణకు తాము న్యాయ పోరాటం చేస్తుంటే కొందరు ప్రజాప్రతినిధులు ధోబీఘాట్ వాసులకు సపోర్ట్ చేస్తున్నారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.కాగా తాజాగా సదరు స్థలాన్ని 7ప్లాట్లుగా చేసి తలా కొంచం పంచుకుందామని కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

వివాదాస్పదంగా మారిన కరపత్ర ప్రచారం...

ఈ ప్రభుత్వ స్థలంలో పాఠశాల, ఆసుపత్రి కట్టాలనే ఉద్దేశంతో భగత్‌సింగ్‌నగర్ వాసులు ఓ జేఏసీగా ఏర్పడి ఓ కరపత్రాన్ని విడుదల చేశారు. అందులో ముఖ్యంగా కుత్బుల్లాపూర్‌లో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ ముందుకొచ్చి రూ.4.50 కోట్లతో పాఠశాల నిర్మాణం చేపడుతుందని ఈ కరపత్రం సారాంశం. వివాదంలో ఉన్న స్థలంలో నిర్మాణాలు ఎలా చేపడతారని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణానికి ఇప్పుడు నిధులు ఇస్తామన్న వారు కొన్నాళ్ల తరువాత చేతులెత్తేస్తే దానికి గ్యారంటీ ఎవరన్నది ప్రశ్నార్థంగా మారింది.

– ఇదే విషయమై జిల్లా విద్యాశాఖ అధికారులను వివరణ కోరగా భగత్‌సింగ్‌నగర్‌లో పాఠశాల భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని తెలిపారు. గ్లాండ్ ఫార్మా ప్రతినిధులను సైతం సంప్రదించగా గతంలో ఎంఈఓను మాత్రమే సంప్రదించామన్నారు. ఇటీవల వస్తున్న వార్తలు, కరపత్రానికి తమకు సంబంధం లేదని పేర్కొనడం కొసమెరుపు.



పాఠశాల నిర్మాణం అంటూ ఇంటింటికీ పంపిన కరపత్రం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మా విల్లాస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ ఎస్ఎల్‌జీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

◆ బౌరంపేట్ సబ్‌స్టేషన్ 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు లక్ష్మీనగర్ కాలనీ, విశ్వకర్మ కాలనీ, సూరారం గ్రామం, అయ్యప్ప సొసైటీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయికిరణ్ తెలిపారు.

◆ ప్రగతినగర్ సబ్‌స్టేషన్ 11కేవీ డాక్టర్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిల్పా లేఅవుట్, ఎస్.ఏ.ఎస్. ఫంక్షన్ హాలు, కెనరా బ్యాంక్, డాలర్ హోమ్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ తెలిపారు.

ఘనంగా అక్షర పాఠశాల వార్షికోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వీరేంద్ర చిన్నోజు

కుత్బుల్లాపూర్: సుచిత్రలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ప్రముఖ వైద్యుడు వీరేంద్ర చిన్నోజు, పాఠశాల చైర్మన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఏడాది కాలంలో పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఫైనాన్స్ డైరెక్టర్ రామారావు, ప్రిన్సిపాల్ జానకీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు



కొంపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడతానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో సూరారం డివిజన్ వేమనరెడ్డి నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కౌసల్య నగర్ వాసులు కాలనీలోని ఎస్ఎన్‌డీపీ నాలాపై శ్లాబ్ మూతలు ఏర్పాటు చేయాలని కోరారు. గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ ఏరోనాటికల్ కాలనీలో సీసీరోడ్లు ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు అందజేశారు.

మొక్కును చెల్లించుకున్న ఎమ్మెల్యే..

◆ సుభాష్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు అడప శేషు ఎమ్మెల్యేగా వివేకానంద్ అత్యధిక మెజార్టీతో గెలవాలని అమ్మవారికి మొక్కుకున్న నేపథ్యంలో సుభాష్‌నగర్ పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు బలరామ్‌రెడ్డి, బిజిలి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన...

◆ కొంపల్లి మున్సిపల్‌పరిధి జయభేరి ఎన్క్లేవ్‌లో రూ.75 లక్షలతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే వివేకానంద్ శంకుస్థాపన చేశారు. కృతజ్ఞత యాత్రలో భాగంగా కొంపల్లి పాత గ్రామం, జయభేరి పార్క్ కాలనీల్లో పర్యటించగా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగయ్యానాయక్, బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్ గౌడ్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ ఐడీఏ గాంధీనగర్



రంగారెడ్డినగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణం

రంగారెడ్డినగర్: ఐడీఏ గాంధీనగర్ ప్రాంతం అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఇప్పటికే ఐడీపీఎల్- జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులో పారిశ్రామికవాడ ప్రాంతంలోని స్థలాలను కమర్షియల్‌గా మార్చేశారు. బహుళ అంతస్తుల పేరిట అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నా సంబంధిత ఐలా అధికారులు ధనార్జనే ధ్యేయంగా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా ఓ ఇండస్ట్రీ యజమాని రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాన్ని చేపట్టడం వివాదాస్పదంగా మారింది.

◆ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామికవాడలోని రంగారెడ్డినగర్‌ను ఆనుకుని ఉన్న ఐడీపీఎల్ రోడ్డులో ప్రేరణ ఇండస్ట్రీస్ కొనసాగుతోంది. సదరు భవన యజమానికి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రోడ్డుపైకి జరిగిన మూడు అంతస్తుల మేర అక్రమ నిర్మాణాన్ని చేపట్టాడు. అసలు పది ఫీట్ల మేర ఉన్న రోడ్డు కాస్త అక్రమ నిర్మాణంతో మరింత కుంచించుకుపోయింది. అంతే కాకుండా అటుగా వెళ్తున్న విద్యుత్ వైర్లకు సమీపంలోనే నిర్మాణం చేపట్టడం గమనార్హం.

◆ ఈ విషయమై సదరు నిర్మాణదారుడిని స్థానికులు ప్రశ్నిస్తే తాను రోడ్డు స్థలాన్ని ఆక్రమించలేదని చెబుతున్నారు. మిగతా భవనాలకు సమానంగా నిర్మాణాన్ని చేపట్టానని చెప్పడం గమనార్హం. ఐడీఏ గాంధీనగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఐలా అధికారులు చర్యలు తీసుకుంటారా లేదా వదిలేస్తారా? అనేది వేచి చూడాలి.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

దుండిగల్: స్థానిక సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను చేపడుతున్నామని బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో రూ.38 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళీయాదవ్, శ్యామ్, బాబు, దిలీప్, పార్వతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు నివాళి

నిజాంపేట్: జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘం నాయకుడు, కామ్రేడ్ నవులూరి సాంబశివరావు సంస్మరణ సభను ఆదివారం ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దివంగత సాంబశివరావు విద్యావేత్త, మేధావి అని కొనియాడారు. 'పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా ప్రజలది'అన్నట్లు బతికారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బాచుపల్లి మండల నాయకులు పాలబిందెల శ్రీనివాస్, యాదయ్య, జన విజ్ఞాన వేదిక నాయకుడు చారి, కేవీపీఎస్ నాయకుడు బాలుపీరు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరసనగా ఈనెల ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, అశోక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో కీలుకాని లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. కార్మికులు, కర్షకులకు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు శ్రామిక, కర్షకులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో వేలాదిగా కార్మికుల పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గళాన్ని వినిపించాలని కోరారు. కార్మిక నాయకులు దేవదానం, రాములు, లింగస్వామి, చంద్రశేఖర్, సుంకిరెడ్డి, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా శంభీపూర్ రాజును గెలిపించుకుంటాం

బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా నిలబడితే తప్పకుండా గెలిపించుకుంటామని ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యువజన బీఆర్ఎస్ విభాగం అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పాలే శ్రీకాంత్, రుద్ర అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి రాబోవు పార్లమెంట్ ఎన్నికలపై చర్చించడం జరిగింది. పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా శంభీపూర్ రాజును పోటీ చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి పార్టీ ఆదేశానుసారం పనిచేస్తానని తెలిపారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పూర్తిస్థాయిలో బలం ఉండగా, ఇటీవల జరిగిన పార్లమెంట్ స్థాయి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో శంభీపూర్ రాజు పేరు ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది. ఇదే విషయంపై కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన పలువురు ముఖ్య నేతలు శనివారం ఎమ్మెల్సీతో సమావేశం కావడం విశేషం

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియూ జిల్లా అధ్యక్షుడు అశోక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో సీఐటీయూ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో దేవదానం, రాములు, లింగస్వామి, చంద్రశేఖర్, సుంకిరెడ్డి, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు శుభాకాంక్షలు



వెంకయ్యనాయుడుకు రాములవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎస్.మల్లారెడ్డి

దుండిగల్: పద్మ విభూషణ్ అవార్డు పొందిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును ఆదివారం బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు బౌరంపేట గ్రామం గురించి మల్లారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. 1988 సంవత్సరంలో ఒకసారి, కేంద్ర మంత్రిగా 2016లో మరొకసారి ఆయన బౌరంపేట గ్రామానికి వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు.

మౌలిక వసతుల కల్పనలో విఫలం



ఎన్టీఆర్ నగర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేత కొలన్ హన్మంతరెడ్డి

సుభాష్‌నగర్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప స్థానిక సమస్యలపై పట్టించుకున్న దాఖలాలు లేవని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కోట్లాది నిధులు వెచ్చించామని గొప్పలు చెబుతున్న స్థానిక ప్రజాప్రతినిధులు బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. సంబంధిత అధికారులతో మాట్లాడి డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంక్షేమ సంఘం నాయకులు, నాయకులు తదితరుల పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



డీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రతాప్‌ను కలిసిన వెంకటేశ్వరనగర్ ఈస్ట్ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వరకాలనీ ఈస్ట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం డీసీసీ మాజీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీలో అండర్‌గ్రౌండ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మరడంతో రోడ్లపై మురుగు పారడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే ఆయన హెచ్ఎండబ్ల్యూఎస్ జీఎం శ్రీధర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి



ఘటన స్థలంలో మృతుడు మల్లికృష్ణ

దుండిగల్: వెనుక నుంచి వచ్చిన లారీ ఓ బైక్‌ను ఢీకొట్టి అతడిపై నుంచి వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా బురదపాలెంగ్రామానికి చెందిన పగడాల మల్లికృష్ణ(28) జాబ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. కాగా నెల రోజుల క్రితం డి.పోచంపల్లి సారెగూడంలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ప్రతి రోజు గండిమైసమ్మ చౌరస్తాలోని జోష్ బాయ్స్ హాస్టల్‌లో భోజనం చేసేవాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై టిఫిన్ తినేందుకు బయలుదేరాడు. ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో కిందపడిపోయిన మల్లికృష్ణ తలపై నుంచి లారీ టైరు వెళ్లడంతో తల పూర్తిగా ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుజారితే.. అంతే.!



భవనంపై ప్రమాదకరస్థితిలో పనులు చేపడుతున్న కార్మికులు

రంగారెడ్డినగర్: భవన నిర్మాణ కార్మికుల జీవితాలు గాల్లో దీపాలు మాదిరిగా మారుతున్నాయి.. ఎన్ని కార్మిక చట్టాలు వచ్చినా అసంఘటిత రంగ కార్మికులకు రక్షణ లేకుండాపోతోంది. ఐడీపీఎల్ - జగద్గిరిగుట్ట రోడ్డులోని రంగారెడ్డినగర్ ప్రధాన రోడ్డులో నిర్మితమవుతున్న ఓ బహుళ అంతస్తుల భవనంపై కార్మికులు ప్రమాదకరంగా పనులు చేపడుతుండగా 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది. భవనం వెలుపల భాగంగా ఎలాంటి ఆధారం లేకుండా కార్మికులు పనులు కొనసాగిస్తున్నారు. ఆదమరిస్తే వారి ప్రాణాలకే పెను ప్రమాదం కలిగే అకాశముంది. ఈ విషయమై కార్మిక శాఖ అధికారులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.